
# దత్తకాగితం

బాబూశిలం



విసిరిన కాగితం వచ్చి శ్రీపతి కాళ్ళ మీద పడింది!

వురుకుతూ వచ్చిన సూర్యం వచ్చిన దారినే పోయాడు!!

వుండగా చుట్టిన కాగితం శ్రీపతినే వెక్కిరిస్తుంది...???

ఆలోచిస్తున్న శ్రీపతికి అనురాగం శూన్యమయిపోయింది—అంతక్రితం పోతూపోతూ అన్నయ్య సూర్యం అన్నమాటలు ఎదలో రక్తాన్ని ఏతాములా తోడుతున్నయి—అహంకారపు తెరలను చించి మరీ చూపుతున్నయి!!!

కాళ్ల మీద నిలువలేక, కుర్చీలో కూలబడ్డాడు—శ్రీపతి!

కాళ్ళ దగ్గర కాగితం కర్తవ్యాన్ని చెబుతుంది శ్రీపతికి!!

* * *

మిట్టమధ్యాహ్నం శ్రీపతి తన శ్రీమతితో వాళ్ళ వ్యాపారంలో లాభాలను గూర్చి ముచ్చటిస్తుంటే వురుకుతూవచ్చి పడ్డాడు సూర్యం.

"తమ్ముడూ!.. త్వరగా తమ్ముడూ!" బీదరికపు బాటలో బహుదూరం పయనించిన బాటసారిలా వున్నాడు. మాసినగెడ్డం, సగం మొఖానికి తారు పూసినట్టుంది. వేసుకొన్న చొక్కా, కట్టుకున్న పంచె ఏ రంగువో చెప్పడం బహుకష్టమయిన పనే!... వణకుతున్న కంఠంతో అన్నాడు సూర్యం:

"మూడురోజులుగా నాన్న మెతుకయినా ముట్ట లేదు. నీకు కబురంపినా రాలేదేం తమ్ముడూ? చివరి క్షణంలోనయినా నాన్నకు ఓమారు కనుపించు!... అలా చూస్తావేం?.. నన్ను గుర్తించలా?...నీ అన్నను —సూర్యాన్ని!!!" సూర్యం కంఠంలో ఏదో వుద్వేగం జనించింది.

"సుగుణా!" శ్రీపతి తన శ్రీమతితో అన్నాడు "కొంచెంసేపు నీవు అవతలకు వెళ్ళు."

సుగుణ ప్రక్కగదిలోనికి పోయింది!

సూర్యం వేపు చూస్తూ అన్నాడు శ్రీపతి "సూర్యం! ఇది జీవితం!! మాతృప్రేమలూ, మమకారాలూ, కన్నవాళ్ళకేకాదు, సాకినవాళ్ళకూ వుంటవి."

చెళ్ళున చరిచినట్లయింది సూర్యానికి చెంప మీద.

"దత్తుకుపోయిన నిన్ను, ఇన్నేళ్ళుగా నిన్ను సాకిన రాఘవయ్యగారిని, విడిచిపుచ్చి రమ్మంటున్నానా... అలా అనలేదు తమ్ముడూ! మృత్యువు మెట్ల మీద నున్న మన నాన్నకు నీ ముఖం ఓసారి చూపించమంటున్నాను. మనలను శాశ్వతంగా విడచిపోబోతున్న ఆయన ఆత్మకు శాంతిని చేకూర్చమంటున్నాను." సూర్యం మాటలు తడబడిపోయాయి.

"నీకూ నాకూ మధ్య 'మన' అన్న పదం నేనిక్కడకు దత్తుకొచ్చిన దరిమిలా మాసిపోయింది" చేతి వాచ్ కేసి చూసుకుంటూ అన్నాడు శ్రీపతి "ఎవరికి వాళ్ళమే మిగిలిపోయాం. మాసిపోయిన ఆ మమతను తిరిగి మేల్కొలపకు. త్వరగా వెళ్ళు."

"తమ్ముడూ!.. తొందరపడకు. మరోసారి ఆలోచించుకో!!" అన్నగా ఆజ్ఞాపించలేదు ఆ కంఠం, ఆదరంగా అర్థించింది "నిన్ను, నన్ను కన్న అమ్మ మనల్ని నాన్నకిచ్చిపోయింది. దొరబాబులా బతకమని నిన్ను దత్తుకిచ్చాడు నాన్న! వున్న కుంట పొలానికి కర్తగా నన్ను కూడా వుంచుకున్నాడు— నాన్న!! మిద్దెపైనుంటున్న నిన్ను చూసి మురిసిపోయాడు. గంజి లేకపోయినా గుట్టుగా గూట్లో పడున్నాడేగాని, ఏనాడూ పట్నంలో వుంటున్న నిన్ను చేయిజాపి పైసా అడగలేదు.

"ఏడాదిగా గుండెజబ్బుతో బాధపడుతూ ఎక్కడ నువ్వు బాధపడతావో అని ఏనాడూ నీకు కబురంపలేదు. ఎందుకనో రెండురోజులుగా నిన్నే కలవరిస్తున్నాడు. ఒక్కసారి వచ్చి నాన్నకు కనుపించు తమ్ముడూ!"

"అంత కడుపుతీపి గలవాడు దత్తెందుకివ్వాలి. దత్తుకిచ్చిన కొడుకు దగ్గర దండిగా వుంది, దోచుకుపోదామనుకున్నారేం..? నువ్వూ, మీ నాన్నా కలిసి" అని మనసులో అనుకున్న శ్రీపతి బయటకు అనలేకపోయాడు.

ఒక్క వుదుటున శ్రీపతి రెండుచేతులూ పట్టుకున్నాడు సూర్యం, "ఇవి చేతులుకావు తమ్ముడూ!" హృదయమున్న మనిషిని కదిలించేలా వేడుకుంది సూర్యం కంఠం.

శ్రీపతిలో మాత్రం ఎలాంటి చలనం కలుగలేదు. చిన్నగా సూర్యం చేతులు విడిపించుకుని ఏదో జ్ఞప్తికి వచ్చిన వాడిలా ప్రక్కగదిలోనికి వెళ్ళాడు. మరో క్షణంలో ఓ కాగితాన్ని తెచ్చి సూర్యం చేతిలో వుంచుతూ అన్నాడు "ఇదిగో!.. ఇది తీసుకొని తక్షణం వెళ్ళు!!"

సూర్యం హృదయం సుళ్ళు తిరిగిపోయింది—ఆ కాగితాని కేసి చూసేసరికి!

"కొడుకు కోసం కలవరిస్తున్న నాన్నకు ఈ వుత్త కాగితం చూపించమంటావా తమ్ముడూ?" శ్రీపతి కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు సూర్యం.

"వుత్తకాగితం కాదది" చేతులు వెనక్కు తీసుకుంటూ అన్నాడు శ్రీపతి "పచ్చుకాగితం! అంటే..

వాళ్ళ నాన్నను తోడుకుపోయిన విధే, శ్రీపతిని కూడా తోడుకు పోతుందని వూహించలేకపోయాడు — సూర్యం!!

శ్రీపతికి చేరువగా వచ్చి, గెడ్డం పట్టి బుజ్జగించబోయి, గతుక్కుమన్నాడు— సూర్యం !!!....

"తమ్ముడూ!" తాడి చెట్టు మొవ్వాకులో రేరాణిలా కూర్చున్న చిరుకప్ప తడబడి పోయింది— కారి దారిలో కాటేసిన ఆ సర్పానికి కైపెక్కిపోయింది— ఆ గూడెంలోని జనానికి గుండాగిపోయింది— ఎలుగెత్తిన సూర్యం కంఠం అణగారిపోయింది..!!!

శ్రీపతి నోటిగుండా కారిన నురగను తుడుస్తూ జేబులో వున్న కాగితానికేసి చూసాడు— సూర్యం! శ్రీపతి జేబులో నుండి తొంగి చూస్తున్న ఆ ఉత్తకాగితం సూర్యానికి సర్వాన్ని చెబ తుంది...... ●

---


Durapac TRADE MARK
A DUREX PRODUCT

ప్రపంచ ప్రసిద్ధి పొందిన రబ్బరు కుటుంబ నియంత్రణ సాధనాలు

ప్రస్తుతం ఇండియాలోనే తయారు!

ప్రపంచం అంతా బాధ్యతగల వ్యక్తులు వినియోగించే ముఖ్యమైన కుటుంబ నియంత్రణ సాధనాలు ప్రస్తుతం ఇండియాలోనే తయారవుతున్నాయి. అంతర్జాతీయంగాను ప్రభుత్వపరంగాను వున్న నియమాల ననుసరించి మూడేసిమార్లు పరీక్ష చేయబడినది. మీ పట్టణంలో వుండే అన్ని ముఖ్యమైన దుకాణాల్లోను డ్యురాపాక్ సులభంగా లభిస్తుంది. సంతోషదాయకమైన కుటుంబాన్ని ప్రణాళికాబద్ధంగా రూపొందించు కొనటానికి డ్యురాపాక్ ఒక అత్యుత్తమ సాధనం.

డ్యురాపాక్ ఎన్నుకొండి-ఇది విశ్వాసపాత్ర మైనది
పరీక్ష చేయబడినది-ఎంతో సురక్షితము!




లండన్ రబ్బర్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
35, పాతట్రంక్ రోడ్, పల్లావరం, మదరాసు-43

చిల్లరధర: ఒక్కొక్కటి 20 పైసలు
3, 5 ఉండే పాకెట్ దొరకును

LRC-2-TEL


---


MIC-11-98

పొదుపుకు
సమర్థతకు
అసలు "మైకో" విభాగాలనే
గట్టిగా కోరండి!



MICO

LICENCE BOSCH

ఆమోదించిన బదిన ప్రతినిధులు.

మోటార్ ఇండస్ట్రీస్ కంపెనీ లిమిటెడ్, బెంగుళూరు

దుర్గ డీసెల్ హౌస్, గోపాల్ రెడ్డి రోడ్, విజయవాడ-2. ■ ఎమ్. శి. ఆటోమొబైల్స్, ఆటోమొబైల్ డీలర్స్, పటేల్ నగర్, బళ్లారి-2. ■ నేషనల్ ఆటో & హార్డువేర్ స్టోర్స్, నాగేశ్వరరావు రోడ్, బకింగ్‌హామ్ పేట, పి. ఓ. విజయవాడ. ■ నమోదిత్ ఆటోమొబైల్స్, ట్రంక్ రోడ్, గుంటూరు-1. ■ ఎయొసీర్ ఏజన్సీస్ బిల్డింగ్ 141, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్. ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ప్రైవేట్) లిమిటెడ్, పి. బి. 42, మెయిన్ రోడ్ కాకినాడ-1. శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ప్రైవేట్) లిమిటెడ్, ఏలూరు రోడ్, విజయవాడ-2. ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ప్రైవేట్) లిమిటెడ్, హార్బరు రోడ్, వాల్తేర్ ఆర్. ఎస్. విశాఖపట్నము-4.